క్లుప్తంగా

గ్రామీణులకు ఆయుర్వేద వైద్యం



ఉప్పర్నాయుడువలసలో రోగులకు ఆరోగ్య సలహా లిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.సునీల్‌కుమార్ వైద్యశిబిరం నిర్వహించి, వైద్యసేవలందించారు. వాత, కీళ్లనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులతో శిబిరానికి హాజరైన వారికి ఆయన ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, మందులు అందజేశారు. అన్నిరకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయని, గ్రామీణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాతపెన్షన్ విధానమే కావాలి



పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరుతున్న ఉద్యోగులు

తెర్లాం: పాతపెన్షన్ విధానమే అమలుచేయాలని మండల సీపీఎస్ సంఘ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు. మండలంలోని వెలగవలస సచివాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి పాతపెన్షన్ విధానమే కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని, అయితే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తే మరింత సంతోషమన్నారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు



కొత్తబోరు అమర్చుతున్న మెకానిక్ వెంకటరమణ

వంగర: మండలంలోని రాజులగుమ్మడ గ్రామంలో కొత్తగా తాగునీటి బోర్లు శుక్రవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ దారపురెడ్డి ఉషారాణి ఆధ్వర్యంలో మెకానిక్ వెంకటరమణ కొత్తబోర్లు అమర్చి, తాగునీటి సరఫరాకు మార్గం సుగమం చేశారు. తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారీని వివరిస్తున్న సిబ్బంది

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో జీవామృతం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులు ముందుకురావాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని రైతు పెంకి గౌరీశ్వరరావు మాస్టారు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మనం సాగు చేసే పంటలకు జీవామృతం పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్లు, చీడపీడల నుంచి పంటను రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం టి.మంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

పక్కాగా డ్రైడే



రోటిలోని నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు

వంగర: మండలంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సవలాపురపు రామారావు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. అనవసరమైన నీటి నిల్వల ప్రదేశంలో దోమలు విపరీతంగా పెరిగి తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని ఆయన కోరారు. అనంతరం కుష్టువ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ సాగు

తొలకరిజల్లు పుడమితల్లిని పలకరించింది. సాగునీటి కాలువలు జలకళను సంతరించుకున్నాయి. ఉరిమే ఉత్సాహంతో రైతులు పొలంబాట పట్టారు. దమ్ము పనుల దగ్గర నుంచి ఆకుతీతలు, వరినాట్లు వేయడంలో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. జానపద పాటలు పాడుతూ మహిళా కూలీలు ఉబాలు వేస్తున్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం అనుకూలించగా, ఖరీఫ్ సాగు జోరందుకుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–రేగిడి



ఉబాలు వేయడంలో నిమగ్నమైన మహిళా కూలీలు



మడ్డువలస రిజర్వాయరు పిల్లకాలువలో జలకళ



పొలంగట్లు సరిచేస్తున్న రైతు



ట్రాక్టరుతో దుక్కి పనులు చేస్తున్న దృశ్యం



వరి ఆకుతీతలు చేపడుతున్న రైతు కూలీలు

విద్యాసామర్థ్యాల మెరుగే లక్ష్యంగా బోధించాలి



రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

రామభద్రపురం: విద్యార్థుల విద్యాసామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని ఎంఈవో తిరుమలప్రసాద్ సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించి, ఉపాధ్యాయుల విద్యాబోధనతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, రుచి, శుచి కలిగిన వంటకాలను విద్యార్థులకు వండిపెట్టాలని నిర్వాహకులకు తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని, పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జె.త్రినాధరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డుతో పాటు పాఠశాల రికార్డు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటకాలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చూడాలన్నారు.

ఎడతెరిపిలేని వర్షం



రామభద్రపురం: వర్షంలో తడుస్తూ మార్కెట్‌కు కూరగాయలు తరలిస్తున్న రైతులు

రామభద్రపురం/బొబ్బిలి రూరల్/రాజాం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు, పొలాల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. దీంతో నదులు, సాగునీటి కాలువలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వర్షం కారణంగా చాలాచోట్ల ప్రజలు బయటకు వచ్చేందుకు ఇష్టపడలేదు. ఈ నేపథ్యంలో ప్రధాన రోడ్లు, జంక్షన్లు, మార్కెట్ ప్రాంతాలు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. రాజాంలో 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాలువల్లోని పూడికలు తొలగించండి

బొబ్బిలి: మండలంలోని రొంపిల్లి చెక్‌డ్యామ్, పెద్దగెడ్డ, వీఆర్ఎస్ ప్రాజెక్టుల కాలువల్లోని పూడికలు తొలగించాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున సీజనల్ చివరి వరకు పంటపొలాలకు సాగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీరు ప్రవహించే కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటు కాలువల వెంబడి ఉన్న జంగిల్స్‌ను కూడా తొలగించాలన్నారు. ఇదే విషయమై కలెక్టరేట్‌లో అధికారులకు ఇటీవల వినతిపత్రం కూడా ఇచ్చామన్నారు.

వివేకానంద విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: పట్టణంలోని యాదవ వీధిలో స్వామి వివేకానంద విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేబీ నాయన హాజరై, కాసేపు మాట్లాడారు. వివేకానంద బోధనలు అనుసరణీయమని, యువత అంతా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. శుక్రవారం మెంతిపేట, గాయత్రికాలనీ, తాణావీధి, సారధి తదితర ప్రాంతాల్లోని కాలువల్లో చేపడుతున్న పూడికతీతలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాలువల్లో నుంచి తీసివేసిన చెత్తాచెదారం, వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించాలని తెలిపారు. ప్రజలు కూడా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ పాడి లక్షుంనాయుడు ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు తొలగించారు. అనంతరం ఆ చెత్తకుప్పలను డంపింగ్‌యార్డుకు తరలించారు.

తాగునీటి వనరుల్లో క్లోరినేషన్..

బొబ్బిలి: పట్టణంలోని తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు శుక్రవారం చేపట్టారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కారణంగా డయేరియా విజృంభించే అవకాశం ఉన్నందున బోరుబావులు, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు.

రాజాం సిటీ: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. హౌసింగ్, శానిటేషన్, తాగునీటి టెస్టింగ్, ఇంటిపన్ను వసూళ్లు వంటి అంశాలపై సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, ప్రతీ గ్రామం స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాజాం పట్టణంలో ఫాగింగ్..

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో దోమల నియంత్రణే లక్ష్యంగా ఫాగింగ్ చర్యలు శుక్రవారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది ప్రతీ వార్డుకు వెళ్లి, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అలాగే వర్షాకాలంలో తలెత్తే సీజనల్ వ్యాధుల బెడదను వివరించి, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నాగావళిలో పెరిగిన వరద ఉధృతి



నాగావళి నదిలో ప్రవహిస్తున్న వరదనీరు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలోని నాగావళి నదిలో వరద ఉధృతి పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత కొన్నిరోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నదిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుకుంటోంది. నదిని అనుసంధానిస్తూ ఉన్న ఓపెన్ హెడ్ చానల్ ద్వారా పంటపొలాలకు సాగునీరు అందుతోంది. ఇదిలా ఉండగా నదిలో నీటి ప్రవాహం వేగంగా ఉండడం, రోజురోజుకూ నీరు పెరుగుతుండడంతో నదీ పరివాహక ప్రాంతాలైన బొడ్డవలస, కొమిర, పుర్లి, వెంకటాపురం, ఖండ్యాం గ్రామాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరి ఎస్ఎస్ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాలకు ఈ నెల 21వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వి.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ వైర్లను తాకే చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండే తుప్పలు, డొంకలు తొలగిస్తున్నందున ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదు

బొబ్బిలి: రాష్ట్రంలో జరుగుతున్న దాడుల పట్ల పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం ఖండించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అధికార పార్టీకి చెందిన వారే ఎక్కువగా ప్రతిపక్ష పార్టీ వ్యక్తుల మీద, వారి ఆస్తులపైనా దాడులకు ఎగబడుతుండడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రౌడీమూకల ఆగడాలు అరికట్టాల్సిన పోలీసులే చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ఇకనైనా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ దాడులను అరికట్టాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలిరూరల్: వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వైద్యారోగ్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.ఎస్.కె.రఘువంశీ సూచించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో భూగర్భ జలాలు కలుషితమవుతాయని, కొత్తనీరు తాగడంతో జలుబు, దగ్గు వంటివి వస్తాయన్నారు. అలాగే ఈగలు, దోమలు వాలిన ఆహారం తింటే డయేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ముఖ్యంగా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వరపీడితులను గుర్తించి వారికి తక్షణమే వైద్యసేవలు అందేలా చూడాలన్నారు.

అద్దెలు వసూలు చేయండి

బొబ్బిలి: పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెలు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, అడ్మిన్‌లతో శుక్రవారం సమావేశమైన ఆమె.. పట్టణంలోని ఖాళీస్థలాలు, కుళాయి, ఇంటి పన్నుల బకాయిలు పెద్దఎత్తున ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి, వసూలు చేయాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌వో ప్రసాదరావు, ఆర్ఐ పి.సురేష్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిశీలన



కొరటాం దగ్గర తోటపల్లి పిల్లకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి ఆమిటి దగ్గరున్న కొరటాం సమీపంలోని పిల్లకాలువలో జరుగుతున్న పూడికతీత పనులను ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీనాయన) శుక్రవారం పరిశీలించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వరి పంటకు అవసరమైన సాగునీరు అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాలువలోని పూడికలు, పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో తొలగించి, సాగునీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కాలువ ద్వారా సాగునీరు ప్రవహించేటప్పుడు కాలువకు గండ్లు పడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు



సుందరాడ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ

తెర్లాం: మండలంలోని సుందరాడ, నెమలాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, ఇతర రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ బృందం కూడా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించేందుకు వస్తున్నందున అన్ని రికార్డులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఉప్పరనాయుడువలసలో అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: వరినాట్లు(ఉబాలు) వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, ఆడవరం, ఉప్పరనాయుడువలస, అక్కన్న అగ్రహారం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉబాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నారు తీసిన తర్వాత వాటి చిగుర్లు తొలగించి, నాటుకోవాలని తెలిపారు. నారు చివరి భాగాన క్రిమిసంహారక పురుగులు గుడ్లు పెట్టి, అది లార్వాగా మారి పంటను పాడుచేస్తాయన్నారు. గుడ్డు దశలోనే ఆ చిగుళ్లను తీసివేస్తే పంట చీడపీడల బారినపడకుండా ఉంటుందన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సదస్సులో హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, ర్యాగింగ్ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నామన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బూరాడలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని బూరాడ, తోకలవలస, లక్ష్మణవలస తదితర గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం ఈ పంటను కత్తెరపురుగు ఆశిస్తుందని, రైతులు నిశితంగా పరిశీలించి, ప్రాథమిక దశలోనే ఆ పురుగు నివారణకు పురుగుమందు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

బొబ్బిలిరూరల్: వెంగళరాయసాగర్ అదనపు ఆయకట్టు కుడికాలువ కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధర చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన బాధిత రైతాంగమంతా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2008లో కాలువ నిర్మాణం కోసం తామంతా అప్పటి భూసేకరణ చట్టం ప్రకారం భూములు ఇచ్చేందుకు అంగీకరించామని, ఆ తర్వాత ప్రభుత్వం కూడా సర్వే చేసి, భూములు స్వాధీనం చేసుకోలేదన్నారు. ఇప్పుడు తామంతా తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు ధర చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.